
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 7 మే 2024
5



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	45.0	25.8
భద్రాద్రి	44.5	27.0

లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఈనెల 11న సాయంత్రం 5 గంటలతో ముగుస్తుండడంతో రాజకీయ పార్టీలు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. రాష్ట్ర నేతలు, కేంద్ర మంత్రులు ఇప్పటికే ఒక దఫా పర్యటించగా.. మిగిలిన ఈ ఐదు రోజుల్లో సినీ నటులతో పాటు, ప్రధాని మోదీ, మరికొంత మంది అతిథులు కూడా ఎన్నికల ప్రచార పర్వంలోకి దిగుతున్నారు.



- మారుమోగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- చివరిదశలో రంగంలోకి పలువురు ప్రముఖులు
- కాంగ్రెస్ తరఫున ఇప్పటికే ముగ్గురు మంత్రుల జోరు..
- తాజాగా తెరపైకి సినీ హీరో వెంకటేశ్..
- బీఆర్ఎస్ నుంచి పువ్వాడ, వద్దిరాజు
- బీజేపీ పక్షాన బస్తర్ రాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్

పోరు.. హోరు

ప్రచారంలో దూసుకుపోతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

ఖమ్మం, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్‌లో బలరాంనాయక్‌లు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో సభలు, సమావేశాలు, ప్రత్యేక కార్యక్రమాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. మధిర నియోజకవర్గంలో భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి ప్రచారం సాగించగా మహబూబాబాద్ నియోజకవర్గంలోని భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రచారంలో పాలుపంచుకున్నారు.

కేంద్ర మాజీ మంత్రి రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి రఘురాంరెడ్డి విజయం కోసం మంగళవారం నుంచి 11వ తేదీ వరకు ప్రచారంలో పాల్గొంటారు. ప్రముఖ సినీ హీరో దగ్గుపాటి వెంకటేష్ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో మంగళవారం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపుకోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నారు. వెంకటేష్ గతంలో తండ్రి రామానాయుడు ఎంపీగా పోటీ చేసినప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భాలున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం ఆయన తొలిసారి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికల ప్రచారంలోకి దిగుతున్నారు. మంగళవారం సాయంత్రం మయూరిసెంటర్ నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు రోడ్‌షోలో పాల్గొని అక్కడ కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. రాత్రి కొత్తగూడెం చేరుకుని అక్కడ ప్రముఖుల సమ్మేళనంలో పాల్గొంటారు.



నేడు హీరో వెంకటేశ్ ప్రచారం

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 6: సినీహీరో వెంకటేశ్ మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు కోసం ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఖమ్మంలోని మయూరిసెంటర్‌కు వెంకటేశ్ చేరుకుంటారు. అక్కడ నుంచి పాతబస్టాండ్, జడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్డు ద్వారా ప్రధాన రహదారిలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. అనంతరం రాత్రి 8గంటలకు కొత్తగూడెం చేరుకొని అక్కడ నిర్వహించే పుర ప్రముఖుల సమావేశంలో పాల్గొంటారు.

ఇప్పటికే వెంకటేష్ కుమార్తె ఆశ్రిత, తన తోటికోడలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమార్తె సప్నిరెడ్డిలు మామ రఘురాంరెడ్డి విజయం కోసం ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

బీఆర్ఎస్ కూడా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. అభ్యర్థి, బీఆర్ఎస్ లోక్‌సభ నేత నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు సభలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు కాంగ్రెస్‌కు దీటుగా ప్రచారం సాగిస్తున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఇక బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కూడా జిల్లాలో ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం ముమ్మరం చేశారు. కళాబృందాలతో ప్రచారం చేస్తున్నారు. సోమవారం లోక్‌సభ నియోజకవర్గంలో పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. బీజేపీ విజయం కోసం బస్తర్ రాజు, కాకతీయుల 22వ వారసుడు కమలచంద్ర భంజ్‌దేవ్ ప్రచారంలో పాలుపంచుకోబోతున్నారు.

సోమవారం సాయంత్రం ఖమ్మం చేరుకుని మంగళవారం నుంచి మూడురోజులపాటు ఖమ్మం మహబూబాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు తాండ్ర వినోద్‌రావు, సీతారాంనాయక్‌ల గెలుపుకోసం సభలు, సమావేశాలు, రోడ్‌షోల్లో పాల్గొనబోతున్నారు. మరికొందరు కేంద్ర మంత్రులును, అగ్రనేతలను ప్రచారంలో దింపేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా
- నేషనల్ హైవేలు, రైల్వేలు, ఎయిర్ పోర్టులు రావాలంటే కమలం గెలవాలి
- బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

బీజేపీ గెలుపుతోనే ఖమ్మం అభివృద్ధి

ఖమ్మం, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకుని, పలు వ్యాపార సంస్థలు నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ బీజేపీ కార్యక్రమాలకు హాజరవుతూ ఖమ్మం లోక్‌సభ ఎన్నికల బరిలో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు తాండ్ర వినోద్‌రావు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోని ములకలపల్లి మండలం తిమ్మంపేట ఈయన స్వగ్రామం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వినోద్‌రావు.. అంచెలంచెలుగా ఎదుగుతూ పలు వ్యాపారాల్లో రాణిస్తూ బీజేపీ టికెట్ సాధించి ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్న వినోద్‌రావుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ....

ప్రశ్న: రాజకీయాల్లోకి రావడానికి, లోక్‌సభ ఎన్నికల బరిలో దిగడానికి ప్రధాన కారణం?

జవాబు: మా స్వగ్రామం ములకలపల్లి మండలంలోని తిమ్మంపేట. మా కుటుంబానికి పాల్వంచ ప్రాంతంలో మంచి గుర్తింపు ఉంది. అమెరికాలో ఉన్నత చదువులు చదివి హైదరాబాద్‌లో వ్యాపారాలు నిర్వహిస్తూ స్వచ్ఛంద సంస్థలు, సేవా కార్యక్రమాలు కూడా కొనసాగిస్తున్నాను. అటు రియల్ ఎస్టేట్ రంగంలో ఉంటూనే 2015 నుంచి ఏకలవ్య ఫౌండేషన్ తరుపున విద్యా, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో సేవా కార్యక్రమాలందించాను. ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తితో బీజేపీతోపాటు అనుబంధ సంస్థల్లోనూ పాల్గొంటూ, కేంద్ర ప్రభుత్వం ద్వారా మరింత సేవచేయాలనే లక్ష్యంతో మొదటిసారి ఎన్నికల బరిలో దిగుతున్నా.



ప్ర: ఎన్నికల్లో మీరు ఇస్తున్న హామీలు?

జ: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను, బీజేపీని గెలిపించారు. బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వమని ప్రచారం చేస్తున్నా. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వల్ల ఒరిగేదేమిలేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే. మళ్లీ ప్రధాని మోదీనే. అందుకే బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి ఎన్నో నిధులు వస్తాయి. జిల్లాలో నేషనల్ హైవేలు, రైల్వేలైన్లు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు, గోదావరి జలశుద్ధి, జలరవాణ వంటి ప్రాజెక్టులు తేవడం సాధ్యమవుతుంది. సింగరేణి సంస్థను కాపాడుకోవడంతోపాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుంది. అలాగే భద్రాచలాన్ని దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేసే అవకాశం కలగనుంది. గిరిజన రిజర్వేషన్ల పెంపు, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ, నిరుద్యోగ యువతకు శిక్షణ సదుపాయాలు, స్టడీసర్కిల్స్ ఏర్పాటు వాటి గురించి కూడా దృష్టిపెడతామని చెబుతున్నా. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో అనేక నేషనల్ హైవేలకు వేల కోట్లరూపాయల నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి పనులు చేస్తోంది. గెలిపిస్తే అభివృద్ధి అద్భుతంగా ఉంటుంది.

ప్ర: ప్రచారంలో ప్రధానంగా మీరు ప్రస్తావిస్తున్న అంశాలు?

జ: పదేళ్లుగా నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, గిరిజనులకు గతంలో 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, పోడుభూముల సమస్యలు పరిష్కరిస్తామని బీఆర్ఎస్ ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన మోసాన్ని వివరిస్తున్నాం. అలాగే స్థానికంగా ఉండే సమస్యలు, తాగు, సాగునీటి సమస్యలను వివరిస్తూ బీజేపీ

మిగతా 6వ పేజీలో...

మోదీ నేతృత్వంలో

అభివృద్ధి పథం

- తాండ్ర వినోద్‌రావు విజయం కోసం వచ్చా..
- కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ



మీడియాతో మాట్లాడుతున్న కమల్‌చంద్ర భంజ్‌దేవ్

కూసుమంచి, మే 6: మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కాకతీయ సామ్రాజ్య వారసుడు బస్తర్ రాజు, కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ అన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి నేరుగా విమానంలో వచ్చిన ఆయన మొదటిసారి పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి శివాలయాన్ని సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా మహాశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తన పూర్వీకులు గణపతి దేవుడి కాలంలో నిర్మించిన ఆలయాన్ని ప్రత్యేకశ్రద్ధతో పరిశీలించారు. ఆలయ అర్చకుని కోరిక మేరకు పునరుద్ధరణ విషయాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళతానని తెలిపారు. తన ఆత్మీయ మిత్రుడు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయంకోసం ఇక్కడికి వచ్చినట్టు పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. ఈసారి ఖమ్మంలో కమల వికాసం ఖాయమన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలిపిస్తే ఖమ్మం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, మేక సంతోష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సుదర్శన్, గడ్డం వెంకటేశ్వర్లు, దాసరి వెంకన్న, శేఖర్ పాల్గొన్నారు.



కొత్తలింగాల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలరాం నాయక్‌కు

భారీ మెజారిటీ ఇవ్వాలి..

- ఆగస్టు 15 కల్లా సీఎం చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభం
- కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్న బీజేపీ
- మంత్రులు తుమ్మల, సీతక్క

కామేపల్లి, మే 6: ప్రతిష్ఠాత్మక సీతారామ ప్రాజెక్టును ఆగస్టు 15కల్లా సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నర్సింహరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సమావేశంలో మంత్రి దనసరి సీతక్కతో కలిసి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఎన్ని వందల కోట్లు ఖర్చు అయినా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి చెబితే 'అన్నా.. నీ ఇష్టం నువ్వు ఏం చేయాలనుకుంటున్నావో అదే చేయి..' అని చెప్పారని అన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో తనకంటే ఎమ్మెల్యే కనకయ్యకు అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించారని, అదే జోష్‌తో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలింపించాలని కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని.. బలరాంనాయక్ కేంద్ర మంత్రి అవుతారని అన్నారు. మతతత్వ పార్టీలు హిందువులు, ముస్లింల మధ్య చిచ్చు రేపుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ పేదల పక్షాన ఉండి పార్లమెంట్‌లో పోరాడిన యోధుడని అన్నారు. బీజేపీ ఉద్యోగాలు ఇవ్వకుండా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నదని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చరణ్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబు నాయకులు మహేందర్ ఎంపీటీసీలు నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, హేమామాలిని మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అడ్రస్

ఇక గల్లంతే...

- సోయి లేకుండా మాట్లాడుతున్న కేసీఆర్
- కోడ్ ముగియగానే ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారు: మంత్రి పొంగులేటి
- బోనకల్‌లో హోరెత్తిన కాంగ్రెస్ కార్నర్ మీటింగ్

6

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ గల్లంతు కావడం ఖాయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోస్యం చెప్పారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వామపక్షాల నాయకులతో కలిసి భట్టి బోనకల్‌లో ప్రచారం నిర్వహించారు. - బోనకల్



బోనకల్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ధాన్యం చెల్లింపులు

వేగవంతం చేయండి

- కొనుగోళ్లు ముమ్మరంగా చేపట్టాలి
- 236 కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

7

తెరపైకి మళ్లీ

ఆ ఐదు పంచాయతీలు

- లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన అస్త్రమిదే
- తొలిసారి మేనిఫెస్టోలో పొందుపర్చిన కాంగ్రెస్
- గెలిపిస్తే విలీనానికి కృషి చేస్తామంటున్న అభ్యర్థులు
- చర్చనీయాంశంగా మారిన భద్రాచలం గోడు

7



ఏపీలోని విలీనమైన యటపాక గ్రామం



ముదిగొండలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

రైతు బిడ్డను..

పిలిస్తే పలుకుతా..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

ముదిగొండ/ ఖమ్మం కార్పొరేషన్, మే 6: తన గొంతులో ప్రాణమున్నంతవరకు జిల్లా ప్రజలతో మమేకమై ఉంటానని బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ముదిగొండలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యకర్తలే దిశానిర్దేశకులని వారి ఆశీస్సులు, ప్రజల దీవెనలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అద్భుత విజయంతో చరిత్ర తిరగరాయబోతోందన్నారు. 25 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉంటూ వారికి సేవ చేస్తూ అండగా ఉన్నానని అన్నారు. ఈ జిల్లా రైతుబిడ్డను పిలిస్తే పలుకుతానని, 24 గంటలు తన ఇంటి తలుపు తడితే ప్రజల కోసం తెరిచి ఉంటాయన్నారు. రైతు వ్యతిరేక చట్టాలకు పార్లమెంట్‌లో నాడు పోరాడానని గుర్తుచేశారు. నిత్యం ప్రజలతో ఉంటున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. పది సంవత్సరాలు ఎంపీగా ఉండి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ, బొమ్మెర రామ్మూర్తి, మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మీగడ శ్రీనివాస్‌యాదవ్, ఎర్ర వెంకన్న, ధర్మా, పసుపులేటి వెంకట్ పాల్గొన్నారు.

నామా కుమారుల ప్రచారం

నిత్యం అభివృద్ధిని కాంక్షించే బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కుమారులు భవ్యతేజ, పృథ్వీతేజ, నామా సోదరుడి కుమారుడు సాయిరాం కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఖమ్మం నగరంలోని వీడీవోస్ కాలనీ, గొల్లగూడెంలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నమూనా బ్యాలెట్‌ను చూపుతూ కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు, బీఆర్ఎస్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ స్థానంలో గెలుపుపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి వారు కేడర్‌తో ప్రచారంలో బిజీగా ఉంటున్నారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తిస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. భద్రాద్రి సెగ్మెంట్‌లో పోలైన మెజార్టీ ఎంపీ అభ్యర్థిగా కీలకంగా మారనుంది.



తగ్గేదేలే..

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

- ఆధిక్యం చాటేందుకు కాంగ్రెస్ కసరత్తు
- బీఆర్ఎస్ సత్తా చాటేనా ..
- కమలం వికసించేనా ...
- మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో భద్రాద్రి ఆధిక్యమే కీలకం

భద్రాచలం, మే 6: మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో గత మూడు ఎన్నికల్లో రెండుసార్లు టీఆర్ఎస్, ఒకసారి కాంగ్రెస్ గెలుపు సాధించాయి. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆరింటిలో విజయం సాధించి తన సత్తా చాటింది. ఇటీవల బీఆర్ఎస్ తరఫున భద్రాచలం అసెంబ్లీ స్థానం నుంచి విజయం సాధించిన డాక్టర్ తెల్లం వెంకట్రావు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పార్లమెంటు పరిధిలో పూర్తిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నట్లయ్యింది.

అయితే నామినేషన్ల ఘట్టం ముగిసిన అనంతరం ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు గెలుపు కోసం తమదైన శైలిలో పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున పోరిక బలరాంనాయక్, బీజేపీ తరఫున డా. అజ్మీర సీతారాంనాయక్, బీఆర్ఎస్ తరఫున సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత బరిలో ఉన్నారు.

ఆధిక్యం చాటేందుకు కాంగ్రెస్ కసరత్తు

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆయన అనుచరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారిపోయాయి. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పూర్తి ఆధిక్యం చాటేందుకు కాంగ్రెస్ ఇప్పటికే కసరత్తు చేపట్టింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే దుమ్ముగూడెం మండలంలోని గంగోలు గ్రామంలో జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉండటం దీనికి అదనంగా ఎమ్మెల్యే చేరిక సైతం ఆధిక్యం చాటేందుకు దోహదపడుతుందని ఆపార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. భద్రాద్రి అసెంబ్లీ పరిధిలో కనీసం 15 నుంచి 20 వేల మెజార్టీ సాధిస్తామని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఏ మేరకు ఇది ఓట్ల రూపంలో పార్టీకి ఉపకరిస్తుందనేది వేచి చూడాల్సి ఉంది. కాగా ఎమ్మెల్యే తెల్లం, మాజీ ఎమ్మెల్యే పొదెం మధ్య ఐక్యతా రాగం కనిపించడంతో ఇది లోక్‌సభ ఎన్నికల్లో ఎంతమేరకు దోహదపడుతుందనేది తేలాల్సి ఉంది. ముఖ్యంగా వామపక్షాలు, టీజేఎస్ మద్దతు కాంగ్రెస్‌కు ఉండటంతో అది భారీ ఆధిక్యం చాటేందుకు ఉపయోగపడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యే తమ పార్టీని వీడినా పార్టీ అధిష్ఠానం మద్దతుతో ప్రజల ఆశీస్సులతో ఎవరు ఊహించని రీతిలో లోక్‌సభ ఎన్నికల్లో సైతం భద్రాచలం పరిధిలో తమ సత్తా చాటి చూపిస్తామని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ సత్తా చాటేనా

మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఏ మేరకు సత్తా చాటుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత గత లోక్‌సభ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ పరిధిలో టీఆర్ఎస్ 10,513 మెజార్టీ చాటడం విశేషం. గత లోక్‌సభ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ పరిధిలో 1,45,509 ఓటర్లకు గాను 93,205 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి ప్రస్తుత ఎంపీ మాలోతు కవితకు 31,966 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 21,453 ఓట్లు, సీపీఐ అభ్యర్థికి 18,112 ఓట్లు, టీజేఎస్‌కు 9,663 ఓట్లు, బీజేపీకి 1,884 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యం వామపక్షాలు, టీజేఎస్ గండికొట్టాయి. ఈసారి జరిగిన అసెంబ్లీలో భద్రాచలం స్థానంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ బీఆర్ఎస్ సత్తా చాటినా ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు ఆయన వెంట వెళ్లడం ఆ పార్టీకి పెద్ద ఎదురు దెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నాయకత్వం ఐక్యంగా ఎంత మేరకు తన సత్తా చాటుతుంది అనే దానిపై రాజకీయ వర్గాల్లో సైతం ఆసక్తి నెలకొంది.

కమలం వికసించేనా

గత పార్లమెంటు ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీస్థానంలో బీజేపీ కేవలం 1,884 ఓట్లను మాత్రమే సాధించింది. నోటాకు 1,742 ఓట్లు రావడం గమనించదగ్గ విషయం. అదే రీతిలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీ నామమాత్రపు ప్రభావాన్నే చూపిందని చెప్పక తప్పదు. అయితే గత ఎన్నికలకు ప్రస్తుతం జరిగే ఎన్నికలకు ఎంతో తేడా ఉందని పార్లమెంటుస్థాయి ఎన్నికలు కావడంతో మోదీ విధానాలు, అభివృద్ధి పార్టీ ఆధిక్యతను చాటేందుకు దోహదపడుతుందని ఆ పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు. ఐదు మండలాల పరిధిలో ఈసారి ఏ మేరకు కమలం వికస్తుందనేది వేచి చూడాల్సి ఉంది.



మాట్లాడుతున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి
- ఘనంగా మహిళా కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 6: రాష్ట్రంలో ఆడపడుచులందరికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని, ప్రతీ సంక్షేమ పథకంలోను మహిళలకు ఎక్కువ అవకాశం కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. బీజేపీ రాముడు పేరుతో ఓట్లు అడుగుతుందని, కులాలు, మతాలతో విభేదాలు సృష్టిస్తోందన్నారు. ఖమ్మం లో రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావటం ద్వారానే దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మంలోని పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు.

'మాటకు కట్టుబడి నిలబడటం మా మామ రామసహాయం రఘురాంరెడ్డి నిబద్ధత 'అని కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి కోడలు, హీరో వెంకటేష్ కుమార్తె ఆశ్రిత పేర్కొన్నారు. మాటిస్తే 100శాతం అమలు చేస్తారని, పేదలకు తమ ఆస్తులను పంచిన కుటుంబం రామసహాయం కుటుంబం అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, మద్దినేని స్వర్ణకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్లు రఫీదాబేగం, మిక్కిలినేని మంజుల పాల్గొన్నారు

ఖమ్మం లీగల్: .ఖమ్మం జిల్లాకోర్టు ప్రాంగణంలో సోమవారం ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి న్యాయవాదులను, ఉద్యోగులను కలసి తనకు ఓటు వేయమని అభ్యర్థించారు.



రఘురాంరెడ్డికి పుష్పగుచ్చం అందిస్తున్న దృశ్యం

సెక్యులరిజం రక్షణకు కమ్యూనిస్టుల త్యాగాలు

సెక్యూలరిజం కాపాడేందుకు కమ్యూనిస్టు పార్టీలు అనేక త్యాగాలు చేశాయని, బీజేపీ మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడేందుకు మరోసారి కాంగ్రెస్‌తో కలిసి కమ్యూనిస్టులు ముందుకు రావాలని ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. సోమవారం జిల్లా సీపీఐ కార్యాలయానికి వెళ్లిన ఆయన సీపీఐ నాయకులను మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్రనాయకులు మహ్మద్ మౌలాన, జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 6: ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛన్‌దారుల సమస్యలను ఎన్నికల కోడ్ ముగియగానే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం విశ్రాంత ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ మోతుకూరి మధు అధ్యక్షతన నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. ఉద్యో విరమణ చేసిన వారికి చెల్లించాల్సిన ఆర్థికప్రయోజనాలను విడుదలచేసే విషయమ్మై దృష్టి సారిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూన్‌లో సమావేశం ఏర్పాటుచేసి కరువుభత్యం, వేతన సవరణతదితర అంశాలపై చర్చించిసానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్ కన్వీనర్ మధు, దామోదర్‌రెడ్డి, దుర్గారావు, చంద్రశేఖర్, వెంకటనర్సయ్య, మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.

బీజేపీతోనే భావి తరాల అభ్యున్నతి

- ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు
- పాల్వంచలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లతో విస్తృత ప్రచారం

పాల్వంచ, మే 6: భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం ఎల్లప్పుడూ తపించేది కేవలం బీజేపీ మాత్రమేనని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు అన్నారు. సోమవారం పాల్వంచ పట్టణంలోని దమ్మపేట సెంటర్, అంబేద్కర్ సెంటర్, నటరాజ్ సెంటర్, మార్కెట్ ఏరియా, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా భారీ రోడ్‌షో, అనంతరం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్లో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీ అభ్యరిథకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు పని చేస్తుంటే .. బీజేపీ సర్కారు మాత్రం దేశ ప్రజలకు అన్ని పథకాలు అందించి వారికి ఆర్థిక చేయూత నివ్వడానికి కృషి చేస్తుందన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న తన కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెరువు శ్రీనివాస్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు బుడగం రవికుమార్, నారాయణ, గంధం నాగేంద్ర ప్రసాద్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవినాయక్, కటికల రంజిత్, సందీప్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

తండ్రి విజయం కోసం తనయుడి ప్రచారం

తల్లాడ: బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు విజయాన్ని కాంక్షిస్తూ తనయుడు తాండ్ర వినయ్‌రావు సోమవారం తల్లాడ మండలం నర్సింహారావుపేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆశీస్సులతో పోటీచేస్తున్న తన తండ్రి తాండ్ర వినోదరావు గెలిపించాలని కోరారు. యువకులతో కలిసి క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చల్లా నాగులు, మండల ప్రధాన కార్యదర్శి గాదె కృష్ణారావు, వెల్లంకి సుధాకర్, రవితేజ, కిరణ్, నరేష్, కృష్ణ, వెంకటి, రాము, రమేష్, నాగేశ్వరరావు, జనసేన నాయకులు నర్సింహారావు, శంకర్, హన్మంతరావు, గోపి, సాయి పాల్గొన్నారు.

రూ. 25 లక్షల నగదు పట్టివేత

ఖమ్మం క్రైం, మే 6: టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తుల వద్దనుంచి 25 లక్షల నగదును స్వాధీనంచేసుకున్నారు. నగరానికి చెందిన కొదుమూరి కౌశిక్, కొదుమూరి సురేష్, గొల్ల భాస్కర్‌రావు అనే వ్యాపారులు అనుమతి పత్రాలు లేకుండా రూ.25 లక్షల నగదును తీసుకెళుతున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని ఆపి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎన్నికల సెల్ అధికారులకు అప్పగించారు.

టీజేఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

ఖమ్మం కార్పొరేషన్, మే6: ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలంగాణా జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయానికి కృషి చేస్తారన్నారు. సత్తుపల్లి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా వి. బాబు, ఖమ్మానికి బట్టు రాజేందర్‌నాయక్, వైరాకు నూనావత్ రవీందర్, మధిరకు షేక్ సర్దార్ హుస్సేన్, పాలేరుకు బెల్లంకొండ నాగేశ్వరరావు గౌడ్, కొత్తగూడేనికి బరగడ దేవదానం, అశ్వారావుపేట నియోజకవర్గానికి షేక్ నబీ సాహెబ్‌ను ఇన్‌చార్జ్‌లుగా నియమించామని వారు పేర్కొన్నారు.

అటకెక్కిన కాంగ్రెస్ హామీలు

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్

ఖమ్మం కార్పొరేషన్/ రఘునాథపాలెం, మే 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అటకెక్కాయని, కల్యాణలక్ష్మి లేదు, తులం బంగారం లేదు అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని 52, 53, 57 డివిజన్ల పరిధిలోని గట్టయ్యసెంటర్‌లో, 43వ డివిజన్ రేవతిసెంటర్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసిన కేసీఆర్, తెలంగాణ సాధించి అధికారంలోకి వచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రప్రజల సంక్షేమంకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వచ్చిన ఐదు నెలల్లోనే అన్ని సంక్షేమపథకాలను గాలికి వదిలేసిందన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లల వివాహానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష సాయం చేస్తే, నగదుతోపాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ మోసం చేసిందని పువ్వాడ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో గత పదేళ్లలో తాగునీటి కష్టాలు లేవని, ఇప్పుడు ప్రజలు నీళ్లకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేకపోతుందో ప్రజలు ప్రశ్నించాలన్నారు. నామా నాగేశ్వరరావును గెలిపించాలని రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్నర్ మీటింగ్‌లో కార్పొరేటర్లు పగడాల శ్రీవిద్య, బుర్రి వెంకట్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బుర్రి వినయ్‌కుమార్, తాజుద్దీన్, సూత్రాల శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయండి

- రైతు బిడ్డగా ఆశీర్వదించి మరోసారి గెలిపించండి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

జూలూరుపాడు/ చంద్రుగొండ/ అన్నపురెడ్డిపల్లి, మే6: బూటకపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులను యువకులు, ప్రజలు, రైతులు నిలదీయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోనికి వస్తే ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, రైతులకు రుణ మాఫీని అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయినా గ్యారంటీలను అమలు చేయకుండా మోసగించారని, ఆ ప్రభుత్వంపై తిరగబడాలని అన్నారు. అమలు సాధ్యం కాని గ్యారంటీలతో ప్రజలను కాంగ్రెస్ నాయకులు బురిడీ కొట్టించారని తెలిపారు. రైతు బిడ్డగా తనను రెండు సార్లు ప్రజలు ఆశీర్వదించి గెలిపించి పార్లమెంట్‌కు పంపించడంతో ఖమ్మం జిల్లా ప్రజల సమస్యలతో పాటు, తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్ట్‌లు, రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడనని అన్నారు. మరో సారి రైతు బిడ్డగా స్థానికునిగా తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. గత 25 ఏళ్లగా ఎన్టీఆర్ స్ఫూర్తితో నామా ముత్తయ్య ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బాణోత్ మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు గుండాల కృష్ణ, కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, లాకావత్ గిరిబాబు, జడ్పీటీసీ సభ్యులు లాలమ్మ, భూక్యా కళావతి, పీజీ కృష్ణమూర్తి, చావా వెంకటరామారావు, ఎం చిట్టిబాబు, డి నాగేశ్వరరావు, వై వీరభద్రం, సీహెచ్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న నామా నాగేశ్వరరావు

బీజేపీ గెలుపుతోనే ఖమ్మం అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

గెలిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో కూడా ఓటర్లకు చైతన్యం కల్పిస్తున్నాం.

ప్ర: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగంతోపాటు రిజర్వేషన్లు రద్దుచేస్తారని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చేస్తున్న ప్రచారాలు నిజమేనా?

జ: ఇది పూర్తిగా అవాస్తవం. ఎక్కడా రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పలేదు. ఓట్లకోసం ఈ రెండు పార్టీలు బీజేపీని దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. గత పదేళ్ల బీజేపీనే అధికారంలో ఉంది. మోదీనే ప్రధానిగా ఉన్నారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లు ఎక్కడైనా రద్దు చేశారా..? బీజేపీ అధికారంలోకి వచ్చాకనే అన్నివర్గాలకు, మతాలకు మధ్య సోదరభావంతో సామరస్య జీవనం సాగుతోంది.

ప్ర: గతంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తక్కువ ఓట్లు వచ్చాయి... ఈసారి మీ ఓటుబ్యాంకు ఎలా ఉండబోతుంది.?

జ: గతంలో తక్కువ ఓట్లు వచ్చినా అప్పటి ఎన్నికలకు, ఇప్పటి ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంది. ఇప్పుడు దేశం అంతా బీజేపీవైపు చూస్తోంది. ఖమ్మంలో కూడా మెజారిటీ ఓటుబ్యాంకు సాధించి గెలిచి తీరుతామన్న విశ్వాసం ఉంది. అందుకే ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వంటి ప్రముఖులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మరికొందరు కూడా ఎన్నికల ప్రచారానికి రాబోతున్నారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీలో కొత్తగా చేరికలు జరుగుతున్నాయి.

ప్ర: అయోధ్య అక్షింతల పంపిణీతో బీజేపీకి ఓట్లు రాలవని ప్రత్యర్థి పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. దీనికి మీ సమాధానం?

జ: అయోధ్య రామమందిరం అక్షింతల పంపిణీ ఓట్ల కోసం కాదు. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని పంపిణీ చేయడం జరిగింది. అదొక ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమం. భద్రాచలం కల్యాణం తలంబ్రాలు కూడా ఎంతో పవిత్రమైనవి. అయినా కనీసం భద్రాచలం వెళ్లే భక్తులకు కూడా అందించలేని పరిస్థితి. ఈ జిల్లా ప్రజలకు కూడా అందించలేదు. పైగా తలంబ్రాల ప్యాకెట్లు అమ్ముతున్నారు. బీజేపీ అక్షింతలతో ఓట్లుపడతాయని ఎక్కడా చెప్పడంలేదు. పదేళ్ల మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గెలుస్తామని స్పష్టంగా చెబుతున్నా.

బీఆర్ఎస్ అడ్రస్‌ఇక గల్లంతే...

బోనకల్/ చింతకాని/ ముదిగొండ, మే 6: లోకసభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు వచ్చే అవకాశం లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు చేశారు. బోనకల్, చింతకాని, ముదిగొండలో సోమవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు. సాయి బాబా ఆలయం నుంచి బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు పోటెత్తారు. భట్టి, పొంగులేటి, రఘురాంరెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్‌తో కమ్యూనిస్టులు జతకడితే పోరులో ప్రత్యర్థి పార్టీకి ఆనవాళ్లు మిగలవన్నారు. తమకు తెలుగు తమ్ముళ్ల సైతం మద్దతు ఇవ్వడం శుభ పరిణామంగా అభివర్ణించారు. బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతు అవుతుంటే గెలిచే అభ్యర్థి కేంద్రంలో మంత్రి ఎలా అవుతారని ప్రశ్నించారు. కారు గ్యారేజీకి వెళ్లిందని, స్టీరింగ్ ఒకరు, టైర్లు మరొకరు ఊడదీసుకొని తలోదిక్కు వెళ్లిపోయారని, ఇక కారు గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని చమత్కరించారు. గోదావరి జలాలతో జిల్లా రైతుల కాళ్లు కడుగుతామని, పంటలకు సమృద్ధిగా నీరందిస్తామని స్పష్టం చేశారు.



చింతకానిలో భట్టి, పొంగులేటి, రఘురాంరెడ్డి, పోతినేని ప్రచారం

గత వైఎస్ హయాంలో రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులకు రూ.1,400 కోట్ల నిధులను కేటాయించారని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ వాటిని రీడిజైన్ పేరుతో అంచనా వ్యయ నిధులను రూ.25వేల కోట్లకు పెంచి రూ. 8వేల కోట్ల నిధులను మాత్రమే ఖర్చు చేసి రైతులను మోసం చేసిందన్నారు. ఉద్యోగులకు తాము మొదటి తారీకునే వేతనాలను అందిస్తున్నామని, రైతుబంధు నిధులను కూడా జమ చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ సోయి లేకుండా మాట్లాడుతున్నారని ఆయన వాడే పదజాలం మార్చుకోనిపక్షంలో తాము చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్ల మంజూరు ప్రక్రియ తాత్కాలికంగా నిలిచి పోయిందని, కోడ్ ముగియగానే ప్రతీ నియోజకవర్గానికి 3,500ఇళ్లు మొదటి విడతలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగం మారుస్తారు

బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, కులాలను, మతాలను రెచ్చగొడుతూ ఆ పార్టీ విద్వేషాలను సృష్టిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ పార్టీగా మారిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోగా, నేటి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గాడిలో పెడుతున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో రైతులకు సంకెళ్లు వేసిన సంగతి మరిచి నేడు వారిపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టినా బుద్ధి మార్చుకోకుండా అవాకులు చవాకులు పేలడం బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. భట్టి సమక్షంలో రచ్చబండ ఏర్పాటు చేసి ప్రతి పేదవాడికి ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర, జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు, కుసుమకుమార్, మద్దినేని స్వర్ణకుమారి, పైడిపల్లి కిషోర్‌కుమార్, గాలి దుర్గారావు, మోదుగు సుధీర్‌బాబు, గుగులోతు రమేష్, కర్నాటి రామకోటేశ్వరరావు, సీపీఎం, సీపీఐ నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, బాగం హేమంతరావు, దొండపాటి నాగేశ్వరరావు, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు




ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 6: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో ఇటీవల నిర్వహించిన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్రేకపరిచేలా ప్రసంగించారని భద్రాద్రి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ కొత్తగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాము ఖండిస్తున్నామని, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించిన సీఎంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. కేంద్రంలో బీజేపీ మారోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని, రిజర్వేషన్లు తొలిగిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారని రంగాకిరణ్ ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇలాంటి ప్రసంగాలు చట్ట విరుద్ధమని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన వారిలో కొత్తగూడెం బీజేపీ పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్‌యాదవ్, ఓబీసీ నాయకులు ఆకుల నాగేశ్వరరావుగౌడ్, వంశీ తదితరులు ఉన్నారు.

తెరపైకి మళ్లీ ఆ ఐదు పంచాయతీలు!

- లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన అస్త్రమిదే
- తొలిసారి మేనిఫెస్టోలో పొందుపర్చిన కాంగ్రెస్
- గెలిపిస్తే విలీనానికి కృషి చేస్తామంటున్న అభ్యర్థులు
- చర్చనీయాంశంగా మారిన భద్రాచలం గోడు



భద్రాచలం

భద్రాచలం, మే 6: తెరపైకి మళ్లీ ఐదు పంచాయతీల అంశం.....లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలకు ఇదే ప్రధాన అస్త్రం.....దశాబ్ద కాలం క్రితం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏడు మండలాలను పోలవరం ముంపు మండలాల పేరుతో ఏపీలో విలీనం చేయడంతో భద్రాద్రి నియోజక వర్గ భౌగోళిక ముఖ చిత్రం అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా భద్రాద్రిలో అభివృద్ధి ప నులు చేపట్టేందుకు అవకాశం లేని దుస్థితి వచ్చిందంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాన రాజకీయ పార్టీలు ఆ ఐదు పంచాయతీల అం శాన్ని మరోసారి జపిస్తూ ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ఇప్పటి వరకు పలు రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తుతూ వచ్చాయి. కాని అవి పూర్తిస్థాయిలో ఆ ఐదు పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేసేందుకు అంకితభావంతో కృషి చేయలేదనే విమర్శలు భద్రాద్రి ఏజెన్సీవాసుల నుంచి వినిపిస్తున్నాయి.

ఏపీలో భాగమైన గుండాల, పురుషోత్తపట్నం, యటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేస్తామని తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే వెంటనే ఈ ఐదు పంచాయతీలను విలీనం చేయడం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పేర్కొంటున్నారు. ఇంత వరకు కేవలం మాటలకు, హామీలకే పరిమితమైన ఐదు పంచాయతీల అంశం కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చడం పట్ల భద్రాద్రి ఏజెన్సీవాసులు, ఐదు పంచాయతీ వాసులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

గత దశాబ్ద కాలంగా ఏపీ పరిధిలోకి ముంపు మండలాల పేరుతో ముంపులో లేని ఈ ప్రాంతాలను కూడా చేర్చడంతో భద్రాద్రి అభివృద్ధికి విఘాతం కలిగిందని స్థానికులు వాపోతున్నారు. ఏపీ పరిధిలోకి వెళ్లిన ఆ ఐదు పంచాయతీలు తెలంగాణలో విలీనం చేస్తేనే భద్రాచలానికి ఊపిరి పోసినట్లు అవుతుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 2017 నవంబరులో అప్పటి సీఎం కేసీఆర్ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడంతో ఆశలు రేకెత్తాయి. కానీ ఆ తర్వాత అతీగతీ లేకుండా పోయింది.

గత దశాబ్దకాలంగా భద్రాద్రిలో ప్రతి రోజు సేకరించిన 15 టన్నుల చెత్తను డంప్ చేసేందుకు డంపింగ్ యార్డు కూడా లేకపోవడంతో గోదావరి తీరాన ఉన్న కరకట్టపైనే డంప్ చేస్తున్న పరిస్థితి ఉంది. గత ఏడాది రాష్ట్ర గవర్నరు తమిళిసై సౌందరరాజన్‌కు సైతం అప్పటి శాసన సభ్యులు పొదెం వీరయ్య ఐదు పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేయాలంటూ స్థానిక నాయకులతో కలిసి విన్నవించారు. అలాగే భద్రాచలం పర్యటన సమయంలో సైతం గవర్నరుకు ఆ ప్రాంతవాసులు వినతిపత్రం అందజేసి తమ వెతలను వివరించారు. ఇటీవల భద్రాచలం ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రస్తుత సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి ఐదు పంచాయతీలను ఏపీ నుంచి తెలంగాణలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న పోరిక బలరాంనాయక్ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందుకు సంబంధించి చర్యలు చేపడతామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రస్తుత ఎంపీ మాలోతు కవిత, బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అజ్మీర సీతారాంనాయక్‌లు సైతం ఐదు పంచాయతీల విషయంలో తొలి నుంచి తాము భద్రాచలంలో కలిపేందుకు పోరాడుతున్న విషయాన్ని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు.

ఆలయం తెలంగాణలో....

నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో భద్రాద్రి రాముడు తెలంగాణ దేవుడు అని తెలంగాణవాదులు నినదించారు. కాని రాష్ట్రం ఆవిర్భావం అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం తెలంగాణలో....రామయ్య భూములు భద్రాచలంకు కూతవేటుదూరంలోని ఏపీ పరిధిలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్నాయి. ఇక్కడ భద్రాద్రి రామయ్యకు 889.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో 109 ఎకరాల్లో 2018లో శ్రీగోకుల రామం నిర్మాణం చేపట్టగా అడుగడుగునా స్థానికుల నుంచి అవాంతరాలు ఎదురవుతున్నట్లు దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి. ఇక్కడ రామయ్య భూములను తరచూ స్థానికులు ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతుండటంతో దానిని అడ్డుకునేందుకు దేవస్థానం అధికారులు ప్రయత్నించి పోలీసు, రెవిన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆశించిన స్థాయిలో స్పందన లేదని వాపోతున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది దేవస్థానం వైదిక పరిపాలన ఉద్యోగులపై భౌతికదాడులు సైతం జరిగాయి. ఈ భూములు పూర్తిస్థాయిలో సురక్షితంగా రామయ్యకు చెందాలంటే భద్రాద్రిలో పురుషోత్తపట్నం విలీనంతోనే సాధ్యమని రామ భక్తులు భావిస్తున్నారు.

ఆ మార్గంలో ఎన్ని సమస్యలో ...

భద్రాచలం నుంచి పర్ణశాల రామాలయంకు వెళ్లే మార్గంలో మేడువాయి నుంచి తూరుబాక వరకు ఎనిమిది కి.మీ. ఏపీ పరిధిలోనే ఉంటుంది. తూరుబాక బ్రిడ్జి దాటిన అనంతరం మళ్లీ తెలంగాణ ప్రాంతంలోకి ప్రవేశించడం జరుగుతుంది. ఈ మార్గంలో వెళ్లాలంటే ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెళ్లేందుకు సరైన రహదారి మార్గం లేకపోవడంతో భద్రాద్రి నుంచి చర్ల వైపు వెళ్లే వారికి ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఖమ్మం జిల్లాలో 45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఖమ్మంకార్పొరేషన్, మే6: జిల్లాలోని నేలకొండపల్లిలో సోమవారం 45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం సాయంత్రం గాలిదుమ్ముతో కూడిన వర్షం కురిసి వాతావరణం చల్లబడినప్పటికీ సోమవారం ఉదయం నుంచే వేడిమి, ఉక్కపోత మొదలైంది. దీంతో ఉష్ణోగ్రత 45 డిగ్రీలుగా నమోదైంది. కాగా ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ కార్యకర్త గండ్ర లక్ష్మయ్య (75) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. కల్లూరులో ఇద్దరు మిషన్ భగీరథ కార్మికులు శెట్టి దేవదాస్, ఉబ్బని రాజు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఏన్కూరులో వడగళ్ల వాన

ఏన్కూరు, మే6: మండలంలో సోమవారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. ఎండవేడితో ఉక్కిరిబిక్కిరికి గురైన ప్రజలకు సోమవారం కురిసిన వానతో కొంత ఉపశమనం కలిగింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



ఏన్కూరులో పడిన వడగళ్ల వాన

అమెరికాలో భద్రాద్రి రామయ్య కల్యాణం

- 26న సియాటిల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహణ
- వైదిక బృందాన్ని పంపేందుకు దేవాదాయశాఖ చర్యలు

భద్రాచలం, మే 6: భద్రాచలం సీతారామచంద్రస్వామి కల్యాణం అమెరికాలో నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నిర్వాహకులు రామయ్య కల్యాణం నిర్వహించేందుకు భద్రాద్రి దేవస్థానం అర్చక, వైదిక బృందాన్ని పంపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. దాంతో అర్చక, వైదిక బృందాన్ని పంపేందుకు దేవాదాయశాఖ, భద్రాద్రి దేవస్థానం అధికారులు చర్యలు చేపడుతున్నారు. అమెరికా వెళ్లే అర్చక, పండిత బృందంలో ఒక ఉపప్రధాన అర్చకుడు, ముఖ్య అర్చకుడు, ఒక వేదపండితుడి పేరు ఉన్నట్లు దేవస్థానం వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయా పేర్లు ఇప్పటికే దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి వెళ్లినట్లు వినికిడి. నిర్వాహకులు అమెరికాలో మొత్తం మూడు చోట్ల రామయ్య కల్యాణం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 26న సియాటిల్ కన్వెన్సన్ సెంటర్‌ఆర్చ్‌లో భద్రాద్రి రామయ్య కల్యాణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని 3వేలమంది తిలకించేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పసిఫిక్ నార్త్‌వెస్ట్‌లో కనీవిని ఎరుగని రీతిలో భద్రాద్రి రామయ్య కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

'రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా కేవీకేలు'



అవార్డులను ప్రదర్శిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

వైరా, మే 6: దేశంలోనే కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులను అందించే విజ్ఞాన కేంద్రాలుగా ఉన్నాయని పలువురు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాలను పెంచటం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా నూతన సాంకేతికతను అందజేస్తున్నాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రాల ఏడీఈ డాక్టర్ స్వర్ణ, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పి.విజయనిర్మల, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వీరమనోహర్‌రావు ప్రసంగించారు. కృషి విజ్ఞాన కేంద్రాల సేవలను వివరించారు. వైరా కేవీకేకు వచ్చిన అవార్డులను ప్రదర్శించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, ఆర్ఈఏసీ మెంబర్ తుమ్మల రాణాప్రతాప్, శాస్త్రవేత్త డాక్టర్ జెస్సీ సునీత పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

ఖమ్మం రూరల్/ఎర్రుపాలెం, మే 6: ఖమ్మం జిల్లాలో సోమవారం వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. ఖమ్మం రూరల్ మండలం కాంచికల్ గ్రామానికి చెందిన వృద్ధుడు గుండ్రా లక్ష్మయ్య(75) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. సీపీఐ సీనియర్ కార్యకర్త అయిన లక్ష్మయ్య వృద్ధాప్యంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎండ తీవ్రతకు తట్టుకోలేక మూడు రోజులుగా తీవ్రంగా ఇబ్బంది పడుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలంలోని పెద్దగోపవరం గ్రామానికి చెందిన రాసమంటి వెంకటకృష్ణ(45) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. పశువులకాపరిగా జీవనం సాగిస్తున్న వెంకటకృష్ణ ఎండదెబ్బకు గురై రెండు రోజులుగా అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన వెంకటకృష్ణ ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలోని నిరుపయోగంగా ఉన్న రైల్వే భవనంలో పడిపోయి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ధాన్యం చెల్లింపులు వేగవంతం చేయండి

● కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 6: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగిరం చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో, ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 236 కేంద్రాలను ప్రారంభించామన్నారు. 78కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగాయని ఇప్పటివరకు 11317.720 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రంలో నిల్వ ఉంచవద్దన్నారు. ఎప్పటికప్పుడు రవాణా చేయాలని సూచించారు. అకాల వర్షాల పట్ల జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే కేంద్రాలకు ఎక్కువ లారీలు పంపాలన్నారు. కొనుగోలు కేం ద్రాల్లో ఎంత ధాన్యం ఉన్నది, కేంద్ర పరిధిలోని గ్రామాల్లో ఎంత మేర ధాన్యం ఉన్నది నివేదిక సమర్పించాలన్నారు. 1840 ట్యాబ్ నమోదులు చేసినట్టు తెలిపారు. పెండింగ్ ట్యాబ్ నమోదులు వెంటనే పూర్తిచేయాలన్నారు. రైస్ మిల్లుల తనిఖీలు చేపట్టి, సీఎంఆర్ వివరాలు పరిశీలించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ధాన్యం కొనుగోళ్లను పరిశీలించాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఏ దశలోనూ ఆలస్యం చేయవద్దని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నమోదులు పూర్తి చేసి, వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆయన తెలిపారు. ఓపీఎంఎస్ నమోదు చేసి, రైతులకు డబ్బులు అందేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. గత సంవత్సరంలో ఇదే సమయంలో ఎంతమేర సేకరించింది, ఇప్పుడు ఎంత సేకరించింది పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా రవాణా అధికారిణి అఫ్రీన్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అదనపు డీఆర్డీవో శిరీష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఈసెట్ పరీక్షకు మొరాయించిన సర్వర్

- పాల్వంచలో ఘటన
- ఇబ్బందులు పడిన విద్యార్థులు

పాల్వంచ, మే6: పాల్వంచలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఈసెట్ పరీక్షకు సర్వర్ మొరాయించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాస్తవంగా పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు ముగియాల్సి ఉంది. కానీ సర్వర్ మొరాయించడంతో మధ్యాహ్నం 1 గంటకు పారంభమై 4 గంటల వరకు కొనసాగింది. దీంతో పరీక్ష హాల్‌లో ఉన్న 90 మంది అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. పరీక్ష హాలు బయట వారి తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. తమ పిల్లల కోసం వేచి చూస్తూ కేంద్రం వద్దే ఎండలో పడిగాపులు కాచారు. పరీక్ష హాల్లో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని, తమ పిల్లలు రాసిన పరీక్ష చెల్లుబాటు కాకపోతే బాధ్యులు ఎవరని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరడానికి ప్రయత్నించగా ఉస్మానియా యూనివర్సిటీ వారు ఎవ్వరూ అందుబాటులోకి రాలేదని వారు మీడియాతో వాపోయారు.



విలేకరులతో మాట్లాడుతున్న అభ్యర్థుల తల్లిదండ్రులు

గ్రావెల్ తరలిస్తున్న వాహనాల పట్టివేత

బూర్గంపాడు, మే 6: సీతారామ కాల్వ నుంచి గ్రావెల్(కంకర) తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని నకిరిపేట శివారులో గల సీతారామ కాల్వ నుంచి మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం అదనపు ఎస్ఐ నాగభిక్షం దాడులు నిర్వహించారు. అనుమతులే లేకుండా మట్టి తరలిస్తున్న రెండు లారీలు, ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన డ్రైవర్లు, యాజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఖమ్మం రూరల్, మే 6: మండల పరిధిలోని ఎంవెంకటాయపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు లింగనబోయిన పెద్దపుల్లమ్మ (103) సోమవారం మృతి చెందింది. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు వై.విక్రమ్, మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్‌లు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేగినాటి వెంకటనారాయణ, చావా నగేశ్వరరావు, అచ్యూత్‌రావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి ..

మధిరరూరల్, మే 6: మధిర-తొండలగోపారం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతుడి వయస్సు 35ఏళ్లు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. అతని వద్ద ఎటువంటి గుర్తింపుకార్డు ఆధారాలు లభించలేదు. వ్యక్తి మృతదేహాన్ని గుర్తించడం కోసం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో భద్రపరిచారు. మధిర జీఆర్‌పీ ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 87126 58607 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోడకూలి సీతారామ ప్రాజెక్టు కూలీ..

సత్తుపల్లిరూరల్, మే6: నిర్మాణంలో ఉన్న సంప్ గోడ మీదపడి రోజువారీ కూలీ ఒకరు మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం యాతాలకుంటలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారామ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని యాతాలకుంట టన్నెల్ వద్ద హెచ్ఈఎస్ క్యాంప్‌లో రోజువారీ కూలీ పనిచేసేందుకు ఆంధ్రాలోని తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన శ్రీకాకుళపు శ్రీరామమూర్తి (45) 15రోజుల క్రితం వచ్చాడు. ఈ క్రమంలో సంప్ నిర్మాణం చేపడుతుండగా పక్కనే కూర్చుని ఉన్న శ్రీరామమూర్తిపై ప్రమాదవశాత్తు గోడ కూలీ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో ఆంధ్రాలోని కాకినాడకు చెందిన మరో వ్యక్తికి గాయాలవ్వగా స్వగ్రామం తరలించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఖమ్మం క్రైం మే 6: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నందు సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన కొంపల్లి శేఖర్(48) సుతారి పనులు చేస్తూ ఉంటాడు. కుటుంబ కలహాలతో ఈ నెల 1న నగరంలోని మేదరబజార్లో నివసించే తల్లి వద్దకు శేఖర్ వచ్చాడు. తర్వాత ఇంట్లోకి వెళ్లి తనవెంట తెచ్చుకున్న ఎలకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన అతడి తల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓబీ కార్మికుల వేతన సమ్మె సక్సెస్

- యాజమాన్యానికి, కార్మికులకు కుదిరిన ఒప్పందం
- 3వ రోజు సమ్మె విరమించిన కాంట్రాక్ట్ కార్మికులు
- రెండో షిఫ్ట్‌లో ప్రారంభమైన పనులు

మణుగూరుటౌన్, మే 6: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియలోని ఓబీ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులు వేతన సమస్యపై చేపట్టిన మెరుపు సమ్మె సక్సెస్ అయింది. ఓబీ యాజమాన్యానికి, కార్మికులకు నడమ పలు దఫాలుగా జరిగిన చ ర్చల అనంతరం వేతన పెంపుపై ఓ అంగీకారానికి వచ్చారు. కార్మికుల డిమాండ్ మేరకు వేత న పెంపు రూ.1,800/-లు, బోనస్ యథావిధిగా రూ.500/-లు, సమ్మె చేసిన 3 రోజులకు కార్మికులకు మస్టర్ కట్టిచ్చే విధంగా ఓబీ కంపెనీల యాజమాన్యాలు అంగీకరించినట్లు కార్మిక వర్గం పేర్కొంది. దీంతో మూడు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు సోమవారం మధ్యాహ్నం రెండో షిఫ్ట్ నుంచి విధులకు హజరయ్యారు. ఏరియాలోని పీకే ఓసీ-2 వీపీఆర్, ఓసీ-4 దుర్గ, మణుగూరు ఓసీ మహాలక్ష్మి ఓబీ కంపెనీల్లో ఆఫ్ లోడింగ్ పనులు ప్రారంభమయ్యాయి. చర్చలు సఫలం కావడంతో మూడు కంపెనీల కాంట్రాక్ట్ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియాలోని ఓబీ కంపెనీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు 3 రోజులగా చేస్తున్న వేతన సమస్య పరిష్కారమవడంతో కార్మికవర్గం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది. ఓబీ కంపెనీల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించి కార్మికులతో వేతన ఒప్పందం చేసుకోవడంతో కార్మికులు సంతోంగా సమ్మె విరమించి విధులకు హజరయ్యేందుకు సిద్ధమయ్యారు. దీంతో సోమవారం రెండవ షిఫ్ట నుంచి ఓసీ-2, ఓసీ-4, మణుగూరు ఓసీ గనుల్లో ఆఫ్ లోడింగ్ పనులను ఆయా ఓబీ కంపెనీలు ప్రారంభించాయి. ఇది కార్మికవర్గం విజయంగా కాంట్రాక్ట్ కార్మికులు అభివర్ణించుకుంటున్నారు.



ఓబీ సైట్ కార్యాలయం వద్ద ఉన్న కార్మికులు

చెరువు మట్టి తోలుకునే విషయంలో.. రెండు గ్రామాల మధ్య వాగ్వాదం

● అనుమతిని నిలిపివేసిన అధికారులు

మధిరరూరల్, మే 6: చెరువు మట్టి తోలకం విషయంలో రెండు గ్రామాల మధ్య వాగ్వాదం జరిగిన సంఘటన మండలంలోని మా టూరుపేట, నాగవరప్పాడు గ్రామాల రైతుల మధ్య సోమవారం జరిగింది. వివరాల ప్రకారం.. మధిర మండలం మాటూరు రెవెన్యూలో మాటూరు, మాటూరుపేట గ్రామాలకు కలిపి పెద్ద చెరువు ఉంది. ఈ చెరువు నుంచి రైతులు తమ పొలాలకు మట్టి తోలుకొనేందుకు ఇరిగేషన్‌శాఖ నుంచి అనుమతి తీసుకున్నారు. రెండు రోజులుగా స్థానిక రైతులు మట్టిని పొలాలకు తోలుకుంటున్నారు. అయితే పక్కగ్రామమైన నాగవరప్పాడు గ్రామానికి చెందిన పలువురు రైతులు కూడా మాటూరుపేట చెరువులో మట్టి తోలుకొనేందుకు అనుమతి తీసుకున్నారు. ట్రాక్టర్లు తీసుకొని మాటూరుపేట చెరువు వద్దకు వెళ్లారు. దీంతో అక్కడి స్థానిక రైతులు నాగవరప్పాడు గ్రామ రైతులను మట్టిని తోలనివ్వకుండా అడ్డుకున్నారు. ఈ చెరువుకు స్థానిక రెవెన్యూ పరిధిలోగల మాటూరు, మాటూరుపేట గ్రామాలకు చెందిన రైతులు మాత్రమే పొలాలకు మట్టి తోలుకెళ్లాలని, పక్కగ్రామం వాళ్లని తాము ఎట్టి పరిస్థితుల్లో రానివ్వమని అడ్డుకున్నారు. దీంతో చెరువు వద్ద సోమవారం మాటూరుపేట, నాగవరప్పాడు గ్రామాల రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. రైతులు గొడవకు దిగారు. పలువురు రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేయడంతో ఈఈ చెరువుకట్ట వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. అనుమతి ఉన్నా సరే తమను మట్టిని తోలుకోనివ్వడం లేదని నాగవరప్పాడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గొడవ మరింత ముదిరే అవకాశముండటంతో ఇరిగేషన్ అధికారులు పూర్తిగా చెరువు వద్ద నుంచి ఖాళీ చేయించేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. దీంతో పాటు మట్టి తోలుకొనేందుకు అనుమతి ఇచ్చిన అధికారులు రెండు గ్రామాల రైతులు ఘర్షణకు దిగడంతో అనుమతిని రద్దు చేశారు.



మాటూరుపేట చెరువుకట్ట వద్ద వాగ్వాదానికి దిగిన రైతులు

సుబాబుల్ తోట దగ్ధం



దగ్ధమైన సుబాబుల్ పంట

మధిరరూరల్, మే 6: మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలో సోమవారం కల్యాణపు లక్ష్మీనారాయణ, వెలవెంకటేశ్వరరావు అనే రైతులకు చెందిన ఐదెకరాల సుబాబుల్ తోటలకు మంటలు అంటుకున్నాయి. సమీప పొలాల్లోని రైతులు చెత్తను తగులబెడుతుండడంతో ఆ నిప్పురవ్వలు సమీపంలో ఉన్న సుబాబుల్ పంటలకు అంటుకొని దగ్ధమయ్యాయని బాధిత రైతులు తెలిపారు. రూ.ఐదు లక్షలకు పైగా నష్టం సంభవించిందని పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

అశ్వాపురం, మే6: మండల కేంద్రమైన అశ్వాపురం గ్రామ శివారు చింతిర్యాల క్రాస్ రోడ్డు ఓ బెల్టు దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. బెల్టు నిర్వాహకుడు సతీష్ మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడి చేసి 112 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్టీ టీం అధికారి రవీందర్ తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ.18వేలు ఉంటుందని పేర్కొన్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు ఎర్రయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఇరువురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మే6: ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన తాళ్లమడ-బేతుపల్లి మధ్య చోటు చేసుకుంది. ఖమ్మం ఆర్టీసీ డిపోకు చెందిన రాజదాని ఏసీ బస్సు విశాఖపట్నానికి సుమారు 30మంది ప్రయాణికులతో వెళ్తుంది. ఈ క్రమంలో సత్తుపల్లి మండలంలోని తాళ్లమడ-బేతుపల్లి మధ్య జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై నిలిపిన డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ టీ.కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను అత్యవసర ద్వారం గుండా బయటకు పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ప్రమాద స్థలంలో నుజునుజ్జైన ఆర్టీసీ బస్సు, లారీ

● బీజీకొత్తూరులో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం, మే 6: ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని బీజీ కొత్తూరు వద్ద చోటు చేసుకుంది. బీజీ కొత్తూరు గ్రామానికి చెందిన తిరుమారెడ్డి మధుసూదన్‌రెడ్డి ద్వి చక్ర వాహనంపై మొండికుంట వైపు వస్తుండగా, బీజీకొత్తూరు గ్రామ శివారులో పాల్వంచకు చెందిన ఈశ్వర్ ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మాజీ ఎంపీపీకి మంత్రి తుమ్మల పరామర్శ


సత్యాన్ని పరామర్శిస్తున్న తుమ్మల

దమ్మపేట, మే 6: కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ పానుగంటి సత్యాన్ని దమ్మపేటలోని ఆయన నివాసంలో వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. కొద్దికాలంగా సత్యం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల ఆయనను పరామర్శించి సత్యం ఆరోగ్యపరిస్థితులపై కుటుంబసభ్యులను అడిగితెలుసుకున్నారు. తుమ్మల వెంట కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగ ప్రసాదు, కేవి సత్యనారాయణ, గడ్డిపాటి సత్యం, పోతినేని శ్రీరామ వెంకట్రావు, వలీపాషా, మాజీసర్పంచ్ అత్తులూరి వెంకటరామారావు, పగడాల రాంబాబు, రావు గంగాధరరావు, చిన్నంశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్ తదితరులు వున్నారు.

ముత్తంగి అలంకారంలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే6: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యోక్తదారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యదారణ,తలం బ్రాలు,వేద ఆశీర్వచనం నిర్వహించారు.

రేపు సర్వసభ్య సమావేశం: ఎంపీడీవో

దుమ్ముగూడెం మే 6: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఈదయ్య సోమవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి సకాలం లో హాజరు కావాలని అధికారులు, ప్రజాప్రతి నిధులను కోరారు.

గిరిజన గ్రామాలలో రక్తపూతల సేకరణ

బూర్గంపాడు, మే 6: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ పరిదిలోని గిరిజన గ్రామాలైన దేవయ్యగుంపు, సింగారం, పలు గ్రామాలలో వైద్యురాలు డాక్టర్ లక్ష్మీసాహితి సమక్షంలో సోమవారం ముందస్తు మలేరియా రక్తపూతల సేకరణ కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఏ, ఏఎన్ఎం, ఆశాలు ద్వారా రక్తపూతల సేకరణ కార్యక్రమం నిర్వహించి రక్తపూతలు పరీక్షించి ఆర్‌డిటి పరీక్షలు చేశారు. వ్యాధి లక్షణాలు, నిర్ధారణ అయినట్లయితే చికిత్సను అందించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఏఎంవో గొంది వెంకటేశ్వర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌యువో జీతు, రవి, హెచ్‌ఈవో రమణ మూర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

- సేవల ఫలితంగానే సీపీఐకి ఆదరణ: కూనంనేని
- ట్రిపుల్‌ఆర్‌కు కొత్తగూడెంలో లక్ష మెజార్టీ అందించే దిశగా ప్రణాళిక
- మణుగూరులో పలుగు పార పట్టి ఉపాధి కూలీల వద్ద ఎమ్మెల్యే పాయం ప్రచారం
- మండలాల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం సమావేశాలు

కొత్తగూడెం టౌన్, మే 6: ఎన్నికలతో నిమిత్తం లేకుండా అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉండే ఏకైక పార్టీ సీపీఐ ఒక్కటేనని, ప్రజలకు అందిస్తున్న సేవలు ఫలితంగా కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీకి రోజురోజుకి ప్రజాదరణ పెరుగుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ గుమ్మడి కళ్యాణి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పురుషోత్తం, సత్యనాగేశ్వరరావు, వీకే కృష్ణ, సీతక్కలతో పాటు పలువురు వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యే కూనంనేని, సీపీఐ కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషాల సమక్షంలో సీపీఐలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువలు కప్పి సీపీఐలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నమ్మకానికి అనుగుణంగా మరిన్ని సేవలు అందిస్తామని, ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని తెలిపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మిత్ర పక్షాల మద్దతులో ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటి చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందటం కాయమని, కొత్తగూడెం నియోజక వర్గం నుంచి లక్షకు పైగా మెజార్టీ అందించే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కంచర్ల జమలయ్య, నగేష్, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, విజయ్ కుమార్, సత్యనారయణ చారి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పలుగు.. పార చేత పట్టి..

మణుగూరుటౌన్: పలుగు.. పారను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతబట్టాగా.. మహిళా కాంగ్రెస్ నాయకులు మట్టి తట్టలను నెత్తి పెట్టుకుని మరీ ప్రచారం నిర్వహించారు. సోమవారం మణుగూరు మండలంలోని ముత్యాలమ్మనగర్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ.. ఎమ్మెల్యే పాయంతోపాటు కాంగ్రెస పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో బాగంగా ముత్యాలమ్మనగర్ ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే ఉపాధి హామి పథకం కింద పనులు జరిగే ప్రదేశానికి వెళ్లి ఉపాధి పనులు నిర్వహించి మరీ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే పాయంతో పాటు మండలంలోని రామానుజవరం, శివలింగాపురం తదితర గ్రామాల్లో ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్దులు ఎంపీ అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సైదులు, పీరినాకి నవీన్, సామా శ్రీనివాసరెడ్డి, పీ రాజు, సుబ్బారెడ్డి, గుడిపూడి కోటేశ్వరరావు, గాజుల రమ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

జూలూరుపాడు: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో వామపక్ష పార్టీలు బలపరిచిన ఖమ్మం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపుకు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ళ వెంకటరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధన్‌రావు గృహంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ అధ్యక్షతన కాంగ్రెస్, వామపక్ష పార్టీల సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడారు. గ్రామాలలో సంయుక్త ప్రచారాన్ని నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధన్‌రావు, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు వేల్పుల నరసింహారావు, నున్నా రంగరావు, మోదుగ రామకృష్ణ, యల్లంకి మధు, ఎస్‌కె.నాగుల్‌మీరా, రమేష్, రోషయ్య, భూక్య వీరభద్రం, వి.చందర్‌రావు, వెంకటి, మధు, ఈశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలి

ఇల్లెందుటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా, భువనగిరి మినహా, మిగత 16 స్థానాల్లో సీపీఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ నెల 7న ఇల్లెందులో నియోజవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు అబ్దుల్‌నబి, శ్రీనివాస్, మోహన్‌రావు, కిరణ్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి : సీపీఎం

జూలూరుపాడ: ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య వీరభద్రం పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులోని కంగాల బుచ్చయ్య భవన్‌లో సీపీఎం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో నాయకులు వల్లమల చందర్‌రావు, ఊడల వెంకటేశ్వర్లు, ఇస్రా, గార్లపాటి వెంకటి, బాణోత్ మధు, రాధకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఫాసిస్టు బీజేపీని ఓడించాలి: ప్రజాపంథా

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీ దాని మిత్ర పక్షాలను ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బాణోత్ ధర్మా, నాయకులు వై.గోపాలరావు, ఆజాద్, రాంచందర్, కృష్ణయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డికి ముస్లీం మైనార్టీల మద్దతు

చుంచుపల్లి: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డికి ముస్లీం మైనార్టీలు పూర్తి మద్ధతు అని తీర్మాణించామని జిల్లా ముస్లీం మైనార్టీ అధ్యక్షులు నయీం ఖురేషి స్పష్టం చేశారు. సోమవారం ముస్లీం మైనార్టీలు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మాట్లాడి తీర్మాణించారు. అనంతరం ఐక్యతను చాటారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డిని గెలిపించుకుందామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు ఖరీంపాషా, సయ్యద్ అహ్మద్, సర్ధార్, ఎస్‌కె.కాజామియా, జానీ, మహ్మద్ అస్లాం, అక్బర్, నయీం, రషీద్, యాకూబ్, జావెద్, షబ్బీర్, రజీర్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

9న 'ఇండియా' కూటమి ఎన్నికల శంఖారావ సభ

● పాల్గొననున్న మంత్రి తుమ్మల, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

భద్రాచలం, మే 6: ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 9న భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో ఇండియా కూటమి ఎన్నికల శంఖారావ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం రా ష్ట్ర కమిటీ సభ్యులు, భ ద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జరిగిన పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని పినపాక, భద్రాచలం అసంబ్లీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణపై కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు . 9 న జరిగే సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మం త్రి తుమ్మల నాగేశ్వరరావు, భ ద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాం నాయక్ తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి,బండారు శరత్‌బాబు, భీమవరపు వెంకటరెడ్డి, ఎర్రంశెట్టి వెంకటరామారావు, పారెల్లి సంతోష్‌కుమార్, నాదెళ్ల లీలావతి పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని గెలిపించాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి


మాట్లాడుతున్న మాధురి

జూలూరుపాడు, మే 6: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పంపాలని పొంగులేటి మాధురి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి ఆమె మండలంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌తో కలిసి సమావేశాలను నిర్వహించా రు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, మిత్ర పక్షాల నాయకు లు కలిసి కట్టుగా పని చేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. గ్రామాలలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు బాణోత్ విజయబాయి, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, ఎంపిటిసి దుద్దుకూరి మధుసుధన్‌రావు, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్: రేగా

దుమ్ముగూడెం మే 6: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. పత్తిపాకలో సోమవారం బూత్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ గత ప్రభుత్వంపై బురద జల్లుతోందని ఆరోపించారు. తెలంగాణలోని ఏ గ్రామంలోకి వెళ్లినా కేసీఆర్ చేసిన అభివృద్ధి కనబడుతుందన్నారు. ఎంపీగా కవితను గెలిపించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ నాయకులు ఎంపీపీ లక్ష్మి, మానె రామకృష్ణ, సాగి శ్రీనివాసరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్యనారాయణ మూర్తి, కణితి రాముడు, తునికి కామేష్, అపకా వీర్రాజు, సుబ్బారావు, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్ యాత్రతో కాంగ్రెస్‌కు మతి భ్రమించింది

మణుగూరు: బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ బస్ యాత్రకు ప్రజలనుంచి వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులకు, సీఎం రేంత్‌రెడ్డికి మతి భ్రమిస్తోందని బీఆర్ఎస్ నాయకులు, జడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు అన్నారు. సోమవారం మండలంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత గెలుపు కోసం కట్టుమల్లారం, తోగ్గూడెం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన ఓటర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఏనిక ప్రసాద్, బొగ్గం రజిత, జగిడి జ్యోతి, నాయకులు జావిద్ పాషా, వల్లభనేని రమణ, వెంకటరెడ్డి, మడి వీరన్నబాబు, ఉడతానేని రవి, ప్రసాద్, అడబాల సత్యవతి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పరిరక్షణ కోసం కాం గ్రెస్‌ను గెలిపించండి

- 'పాస్' రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వర్

భద్రాచలం/పాల్వంచ, మే 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసిన మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డా.సంగని మల్లేశ్వర్ అన్నారు. భద్రాచలంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం, కేం ద్రంలో మార్పుకోసం ఓటేద్దాం అనే రెండు కరప త్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విభజన హామీలను తుంగలోకి తొక్కి తెలంగాణకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకున్న బీజేపీ ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. రాహుల్ నాయకత్వం బలపరిచే విధంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా .గట్టి ఎల్లయ్య, 1969 తెలంగాణ ఉద్యమ పోరాట యోధులు తిప్పన సిద్దులు, పాస్ నాయకులు అప్పని సతీస్‌కుమార్, బి రంగారావు, కుంచాల రాజారాం, మేడిశెట్టి శ్రీనివాసరావు, డా. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న మల్లేశ్వర్

మోదీని గద్దె దించాలి

పాల్వంచ: అభివృద్ధి నిరోధక ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న నరేంద్రమోదీని గద్దె దించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలంగాణ ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు, ఉద్యమకారుల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రజాసంఘాల రాష్ట్ర వైస్ చైర్మన్ సంగని మల్లేశ్వర్ మాట్లాడారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎల్లయ్య, సిద్దులు, వెంకన్నగౌడ్, ఎర్రంశెట్టి ముత్తయ్య, బరపటి వాసుదేవరావు, వెంకటరమణ, సుధాకర్, నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, కాపర్తి వెంకటాచారి, శ్రీను, బుడగం విజయ్, సాంబయ్య, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

● ఏటూరునాగారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ రాజారామ్


మాట్లాడుతున్న టీటీడబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ రాజారామ్

బూర్గంపాడు, మే 6: విద్యార్థులు తమ చదువును ఇష్టపడి పట్టుదలతో చదివితే ఎంతటి కష్టసాధ్యమైన దానినైనా సుసాధ్యం చేయవచ్చు అని ఏటూరునాగారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ తోకల రాజారామ్ అన్నారు. బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీలో ఏబీఆర్ యూత్ ఆధ్వర్యంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులను సోమవారం ఘనంగా సన్మానించి సత్కారించారు. కాలనీకి చెందిన సీనియర్ పాత్రికేయులు మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 13మంది విద్యార్థులను సత్కరించారు. రాజారామ్ మాట్లాడుతూ పిల్లల చిన్నతనం నుంచి చదువు పట్ల ఏకాగ్రత పట్టుదలతో ముందుకు సాగాలంటే తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, మాధవి, రఘురాం, వేణు, అనూష, వెంకటేశ్వర్లు, రవి, శంకర్‌రావు, సుజీవరాజు, రాజేష్, దుర్గాప్రసాద్, మల్లేశ్వరరావు, శ్రీను, రేవంత్, వెంకటరమణ, ముత్యాలరావు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

జూలూరుపాడు, మే 6: వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై సోమవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాలలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. రహదారులపై వర్షపు నీరు నిల్వటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆకాల వర్షానికి మండలంలోని జూలూరుపాడు, వెంగన్నపాలెం, గుండెపుడి తదితర గ్రామాలలోని కల్లాలలో ఆరబోసిన మొక్కజొన్న తడుసిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా: కూనంనేని

లక్ష్మీదేవిపల్లి, మే 6: పాల్వంచలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాపీమేస్త్రీ వీరన్న భౌతిక ఖాయాన్ని సోమవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని శ్రీనగ్‌కాలనీ పంచాయతీ ఇందిరానగర్‌కు కాలనీలోని మృతుడి నివాసం వద్ద ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించారు. భౌతికఖాయం వద్ద పూలమాల వుంచి నివాళులర్పించారు. ప్రమాదంలో గాయపడిన మృతిడి భార్య, కుమారుడికి మెరుగైన వైద్య చికిత్స అందించేలా చూస్తామన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో శ్రీనగర్‌కాలనీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్‌చంద్, భవననిర్మాణ సంఘం నాయకులు గాజుల రాంచందర్, బండ్ల కృష్ణ, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో పారదర్శకతకు ప్రాధాన్యమివ్వండి

- ఈవీఎంల కమీషనింగ్‌ను ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక
- కొత్తగూడెం, భద్రాచలం సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూంల పరిశీలన
- అశ్వారావుపేట నియోజవర్గాన్ని సందర్శించిన ఖమ్మం కలెక్టర్ గౌతమ్


అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కొత్తగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల కమీషనింగ్‌ను ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. సోమవారం కొత్తగూడెం రామచంద్ర డిగ్రీ కాలేజ్‌లో కొత్తగూడెం నియోజక వర్గ పరిధిలో జరుగుతున్న ఈవీఎంల కమీషనరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అత్యంత పకడ్బందీగా ఈవీఎం కమీషనింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క ఈవీఎం కమీషనింగ్‌కు ఎంత సమయం పడుతుంది, ఎంతమంది సిబ్బందిని కేటాయించారు. తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల కమీషనింగ్ కీలకమని అన్నారు. కమీషనింగ్ చేసిన వాటికి మాక్‌పోల్ చేయాలన్నారు. కమీషనింగ్‌లో ఏదైనా సమస్య ఎదురైనా వెంటనే టెక్నికల్ సిబ్బందికి, మాస్టర్ ట్రైనర్ల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, తహశీల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఖర్చులను రికార్డు చేయండి: కలెక్టర్

భ ద్రాచలం: ఎన్నికల విధులలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ప్రియాంక అన్నారు సోమవారం భద్రాచలంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అకౌంటింగ్ టీం ఆఫీస్‌ను పరిశీలించారు. ఆమె ఖర్చుల రికార్డులను తనిఖీ చేసి ఇప్పటి వరకు అంతరాష్ట్ర చెక్‌పోస్టుల ద్వారా ఎంత నగదు సీజ్ చేశారు?ఎంత విడుదల చేశారు? అనే వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, ప్రచార ఖర్చులు, ఇతరాత్రా ఖర్చులకు సంబంధించి ప్రత్యేక రిజిష్టర్‌ను నిర్వహించాలన్నారు. అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ వాహనాలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించటంలో ఎకౌంటింగ్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, వివిఎస్‌టి, ఎస్‌ఎస్‌టి బృందాలు క్రియాశీలక పా త్ర పోషించాలన్నారు. సెలవు దినాలలో కూడా నిఘా పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎఆర్‌వో, ఆర్డీవో కె దామోదరరావు, అసిస్టెంట్ ఖర్చుల పరిశీలకులు వేల్పుల శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలించిన కలెక్టర్

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని భద్రాచలం అసెంబ్లీ స్థానంలో 176 పోలింగ్ స్టేషన్లకు గాను ఈవీఎంలను కమీషనింగ్ చేసి స్ట్రాంగ్ రూంలో భ ద్రపరిచినట్టు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి , ప్రజా ప్రతినిదులు, భద్రతా సిబ్బంది సమక్షంలో స్ట్రాంగ్ రూం తాళాలు తీసి పరి శీలించారు. ఈ సమయంలో ఈవీఎం మిషన్లు, బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లు అన్నీ స క్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. 23 మంది అభ్యర్థులతో పాటు నోటాతో కలుపుకుని 24 అంకెలు ఉన్న బ్యాలెట్ పేపర్‌ను అంటించి స్ట్రాంగ్ రూంలో భ ద్రపరిచినట్లు తెలిపారు. ఈవీఎంలో మాక్‌పోల్‌ను ఆమె పరిశీలించారు . స్ట్రాంగ్ రూం పరిసరాలలో సీసీ కెమెరాల నీడలో బయట వారు ఎవరూ రాకుండా భద్రతా సిబ్బంది 24 గంటలు ఉండాలన్నారు. ఎటువంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావులేకుండా పోలింగ్ సిబ్బంది మతమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఎన్నికలు సజావుగా సాగటానికి కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.

ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ పగడ్బందీగ చేపట్టాలి

ఖమ్మం లోక్‌సభ ఆర్‌వో గౌతమ్

అశ్వారావుపేట: ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేయాలని, ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియను పగడ్బందీగ పూర్తిచేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ ఆదేశించారు. సోమవారం ఆయన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో చేపడుతున్న అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మంట్‌కు చెందిన 184 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు కమీషనింగ్‌ను చేపట్టారు. రిటర్నింగ్ అధికారి వెంట అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మంట్ సహాయ రిటర్నింగ్ అధికారి వేణుగోపాల్, అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తదితర అధికారులు ఉన్నారు.


అశ్వారావుపేటలో ఈవీఎం కమీషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఖమ్మం లోక్‌సభ ఆర్‌వో గౌతమ్

కాంగ్రెస్ హయాంలోనే కార్మికుల అభ్యున్నతి

- కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోనేరు చిన్ని


ప్రచారం నిర్వహిస్తున్న కోనేరు చిన్ని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 6: కాంగ్రెస్ హయాంలోనే కార్మిక ప్రాంతాలు, కార్మికుల అభ్యున్నతి సాధ్యపడిందని జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్నీ) అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పారిశ్రామిక వాడల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఇంటింట పోస్టర్లను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీపీఐ, సీపీఎం నాయకులు ఆళ్ల మురళి, రజాక్, జమలయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, జానీపాషా, గురుమూర్తి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రంగారావు, సత్యరాజు, మోహన్, వాలి, లక్ష్మీ, సైనాద్, గోబ్రియానాయక్, సారంగపాని, హరినాద్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం నింపేందుకే ఫ్లాగ్‌మార్చ్

- మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మణుగూరు, మే 6: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యాన్ని, భరోసాను నింపేందుకు మణుగూరు పట్టణంలో సోమవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ వృషాలిని సంయుక్తంగా తమ సిబ్బందిలో భారీ ఫ్లాగ్ మార్చ్‌ని నిర్వహించారు. మణుగూరు లోని సురక్షా బస్టాండ్ నుంచి ఆరంభమైన ఈ మార్చ్‌లో పోలీసులు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా, అధైర్య పడకుండా ఒత్తిళ్లకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్, ఎస్ఐ లు సురేష్, కుఆమర్, తిరుపతి, రాజేష్, వెంకటప్పయ్య, రాజేందర్ సీఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ

పినపాక: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును మణుగూరు డీఎస్పీ వి రవీందర్‌రెడ్డి సోమవారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం అధికారి కొమరం లక్ష్మణ్‌రావుతో పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తనిఖీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏడూళ్లబయ్యారం సీఐ టి. కరుణాకర్, ఎస్ఐ వెంకటప్పయ్య లతో ఎన్నికల సందర్భంగా చేపట్టిన ప్రత్యేక బందోబస్తుపై చర్చించి, సమస్యాత్మక ప్రాంతాలుపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.